www.aksharadarbar.com
బుధవారం 07, ఆగస్టు 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :157 | పేజీలు : 05 | వెల : 05

గుండె పగిలింది..

వినేష్ ఫొగట్‌పై అనర్హత వేటు

- ఒలింపిక్స్‌లో ఫైనల్‌లో ఇండియాకు భారీ షాక్
- 50 కేజీల కన్నా బరువు ఎక్కువగా ఉండటంతో రెజ్లర్ డిస్క్వాలిఫై
- భారతీయులను తీవ్ర నిరాశకు గురి చేసిన ఐఓఏ నిర్ణయం
- మరింత బలంతో ముందుకెళ్లాలంటూ ప్రధాని మోదీ ట్వీట్

04

- ఏటూరునాగారం డివిజన్ లో దేవాదుల ఇంటెక్ వెల్, సమ్మక్క బ్యారేజీ, కరకట్టలు, మల్లూరు, పాలెం వాగు తదితర ప్రాజెక్టులు
- ప్రతిష్ఠాత్మకమైన విలువైన ప్రభుత్వ పనుల నిర్వహణలో కరువైన గోప్యత
- ఈఈ క్యాంపు ఆఫీసులోని ప్రైవేట్, వ్యక్తిగత కంప్యూటర్లతో ఆపరేట్
- రూ.కోట్ల ఇరిగేషన్ పనుల బిల్లులతో పాటు అధికారులు, ఉద్యోగుల వేతన బిల్లులూ ప్రైవేటు కంప్యూటర్ల ద్వారే
- ఐపీ అడ్రస్ ను పరిశీలిస్తే బయటపడనున్న అక్రమాల బాగోతం
- క్షేత్రస్థాయిలో పనిచేసే ఇంజినీర్లు, ఉద్యోగులు అంటే కూడా ఆయనకు నచ్చదు
- పదేళ్లుగా పాతుకుపోయిన ఈఈకి తాజాగా నర్సంపేట ఎస్ఈగా అదనపు బాధ్యతలు

02

ప్రైవేట్ కంప్యూటర్లతో బిల్లులు!

నీటిపారుదల శాఖలో జగద్ 'లీలలు'

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయిస్తుంది. నీటి వనరులు, రహదారులు, వంతెనలు, ఇతర అభివృద్ధి పనుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చిస్తుంది. మారుమూల, అటవీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతుంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తీవ్రవాద వామపక్ష ప్రభావిత ప్రాంతాల జాబితాలో గల జిల్లాల్లో ములుగు జిల్లా ఒకటి. ఏజెన్సీ ప్రాంతంతో కూడిన ములుగు జిల్లాలోని ఏటూరునాగారం నీటిపారుదల శాఖ డివిజన్ పరిధి మొత్తం కూడా వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతమే కావడం గమనార్హం. ఈ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ)గా దశాబ్దకాలంగా పనిచేస్తున్న వల్లభనేని జగదీశ్వర్ ప్రభుత్వ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. ఈ డివిజన్ లో నీటిపారుదల శాఖ ద్వారా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి గోప్యతను పాటించకుండా సర్కారు డేటాను అంగట్లో పెడుతున్నారు. ఏటూరునాగారంలోని తమ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాన్ని నామ్ కే వాస్తేగా మార్చిన ఆయన ప్రైవేట్ కంప్యూటర్ లతోనే ప్రభుత్వ పనులను ప్రోత్సహిస్తున్నారు. తన క్యాంపు ఆఫీసు పేరుతో హనుమకొండలోని కేయూ జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్న కార్యాలయంలోని ప్రైవేటు కంప్యూటర్లనే ఎంచక్కా డిపార్ట్ మెంట్ పనులకు వినియోగిస్తున్నారు. వెరసి ఈఈ జగదీశ్వర్ కేవలం తన స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తున్నట్లు స్పష్టమవుతోంది. – అక్షర దర్బార్, నిఘా విభాగం

- విత్తన దుకాణాల నుంచి కాటన్ సీడ్ శాంపిల్ సేకరణ
- వాటిలో కొన్ని టెస్టింగుకు, మరికొన్ని మార్కెట్ కు
- పని దినాల్లోనూ విధులకు సరిగా హాజరు కాని అధికారి
- నిఘా విభాగాల దృష్టికి పలు అంశాలు
- 'అక్షర దర్బార్' కథనం ఎఫెక్ట్

03

శాంపిల్ సీడ్ సేల్!

ఏ బిడ్డ.. ఇది నా అడ్డ..!



ఇదెక్కడో విన్నట్లుంది అనుకుంటున్నారా?? మీరు వున్నది నిజమే అది అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా లోనిదే సాంగ్..ఇదే రీతిలో ఈ అడ్డా నాదే అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి పదేళ్లుగా ఓకే గ్రామంలో తిష్ట వేసుకుని కూర్చున్నాడు. కాటారం మండలంలో తాను ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. పదేళ్లుగా ఇక్కడే ఉంటూ అక్రమార్జనకు తెరలేపారు. అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అడ్డుకునేదెవరంటూ ఇష్టరీతినా వ్యవహారిస్తున్నాడు.

04

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

ప్రైవేట్ కంప్యూటర్లతో బిల్లులు!

- ఏటూరునాగారం డివిజన్ లో దేవాదుల ఇంటెక్ వెల్, సమ్మక్క బ్యారేజీ, కరకట్టలు, మల్లూరు, పాలెం వాగు తదితర ప్రాజెక్టులు
- ప్రతిష్ఠాత్మకమైన విలువైన ప్రభుత్వ పనుల నిర్వహణలో కరువైన గోప్యత
- ఈఈ క్యాంపు ఆఫీసులోని ప్రైవేట్, వ్యక్తిగత కంప్యూటర్లతో ఆపరేట్
- రూ.కోట్ల ఇరిగేషన్ పనుల బిల్లులతో పాటు అధికారులు, ఉద్యోగుల వేతన బిల్లులూ ప్రైవేటు కంప్యూటర్ల ద్వారే
- ఐపీ అడ్రస్ ను పరిశీలిస్తే బయటపడనున్న అక్రమాల బాగోతం
- క్షేత్రస్థాయిలో పనిచేసే ఇంజనీర్లు, ఉద్యోగులు అంటే కూడా ఆయనకు నచ్చదు
- పదేళ్లుగా పాతుకుపోయిన ఈఈకి తాజాగా నర్సంపేట ఎస్ఈగా అదనపు బాధ్యతలు

నీటిపారుదల శాఖలో జగడ్ 'లీలలు'

అక్షర దర్బార్, నిఘా విభాగం: నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయిస్తుంది. నీటి వనరులు, రహదారులు, వంతెనలు, ఇతర అభివృద్ధి పనుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చిస్తుంది. మారుమూల, అటవీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతుంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తీవ్రవాద వామపక్ష ప్రభావిత ప్రాంతాల జాబితాలో గల జిల్లాల్లో ములుగు జిల్లా ఒకటి. ఏజెన్సీ ప్రాంతంతో కూడిన ములుగు జిల్లాలోని ఏటూరునాగారం నీటిపారుదల శాఖ డివిజన్ పరిధి మొత్తం కూడా వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతమే కావడం గమనార్హం. ఈ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ)గా దశాబ్దకాలంగా పనిచేస్తున్న వల్లభనేని జగదీశ్వర్ ప్రభుత్వ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. ఈ డివిజన్ లో నీటిపారుదల శాఖ ద్వారా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి గోప్యతను పాటించకుండా సర్కారు డేటాను అంగట్లో పెడుతున్నారు. ఏటూరునాగారంలోని తమ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాన్ని నామ్ కే వాస్తేగా మార్చిన ఆయన ప్రైవేట్ కంప్యూటర్లతోనే ప్రభుత్వ పనులను ప్రోత్సహిస్తున్నారు. తన క్యాంపు ఆఫీసు పేరుతో హనుమకొండలోని కేయూ జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్న కార్యాలయంలోని ప్రైవేటు కంప్యూటర్లనే ఎంచక్కా డిపార్ట్ మెంట్ పనులకు వినియోగిస్తున్నారు. ఈ కంప్యూటర్ల ద్వారా ఏటూరునాగారం డివిజన్ లో ఇరిగేషన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చేస్తున్నారు. అంతేకాదు, ఈ డివిజన్ లోని ఇరిగేషన్ అధికారులు, ఉద్యోగులకు వేతన బిల్లులు కూడా హనుమకొండ కేంద్రంగా పనిచేస్తున్న క్యాంప్ ఆఫీసులోని ప్రైవేట్ కంప్యూటర్ల ద్వారే జరుగుతుండటం విశేషం. ఏటూరునాగారం డివిజన్ లో ఇరిగేషన్ పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టు సంస్థ ఈఈ క్యాంప్ ఆఫీసులో ఈ ప్రైవేట్ కంప్యూటర్లను సమకూర్చటం కోస మెరుపు. అత్యంత విలువైన ప్రభుత్వ పనులకు సంబంధించిన పనులకు ప్రైవేటు, వ్యక్తిగత కంప్యూటర్లను వాడుతుండటం బరితెగింపుగా నీటిపారుదల శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రిటైర్డ్ ఇంజనీర్లు అభివర్ణిస్తున్నారు. వెరసి ఈఈ జగదీశ్వర్ కేవలం తన స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

ఐపీ అడ్రస్ ను పరిశీలిస్తే...

ఏటూరునాగారం ఇరిగేషన్ డివిజన్ పరిధిలో గోదావరి నదిపై జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఇంటెక్ వెల్ తో పాటు ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లతో చేపట్టిన సమ్మక్క బ్యారేజీ ఉంది. వీటికి తోడు ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో గోదావరిపై కరకట్టల నిర్మాణం, మంగపేట మండలంలో మల్లూరు వాగు ప్రాజెక్టు, వాజేడు మండలంలో పాలెం వాగుతో పాటు డివిజన్ లో ఇతర ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు ఎన్నో జరుగుతున్నాయి. ఇంత ప్రతిష్టాత్మకమైన పనుల వివరాలు, బిల్లులు హనుమకొండలోని ఈఈ క్యాంప్ ఆఫీసులో గల ప్రైవేటు, వ్యక్తిగత కంప్యూటర్ల ద్వారా చేస్తుండటం ప్రస్తుతం డిపార్ట్ మెంట్ లో చర్చనీయాంశమైంది. ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) అడ్రస్ ను పరిశీలిస్తే హనుమకొండలోని క్యాంప్ ఆఫీస్ లో గల ప్రైవేట్ కంప్యూటర్ల ద్వారా ఏటూరునాగారం డివిజన్ లోని ఇరిగేషన్ పనుల బిల్లులు, అధికారులు, ఉద్యోగుల వేతనాల బిల్లులను కూడా ఆపరేట్ చేస్తున్న విషయం వెలుగులోకి రానుంది.

పనిచేసే వారంటే...

ఏటూరునాగారంలోని డివిజన్ కార్యాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయకుండా, రికార్డులు ఉండకుండా, ఈ ఆఫీసుకు అధికారులు, ఉద్యోగులు ఎవరు రాకుండా చేసి హనుమకొండలోని క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్ ను ఆపరేట్ చేస్తున్న ఈఈ డివిజన్ లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఇంజనీర్లను కూడా పనిచేయకుండా ఆటంకాలు కలిగిస్తున్నట్లు తెలిసింది. ఈ డివిజన్ లోని ఆయా సబ్ డివిజన్, సెక్షన్ లో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షణ విషయంలో స్థానిక ఇంజనీర్లు ఎవరైనా ప్రత్యేక దృష్టి పెట్టినా, చిత్తశుద్ధితో పనిచేసినా ఈఈ వారిని టార్చర్ చేస్తారని, చివరకు వారే బదిలీపై వెళ్లేలా లేదంటే తానే బదిలీపై పంపించేలా చేస్తారనేది ప్రచారంలో ఉంది. ఈ డివిజన్ లో ఆయన ఇప్పటికే కొందరు డీఈఈలు, ఏఈలను బదిలీపై పంపినట్లు శాఖలో చెప్పుకుంటున్నారు. నిర్దేశిత పనిచేసే అధికారి, ఉద్యోగిని ప్రోత్సహించాల్సిన ఒక ఉన్నతాధికారి ఇలా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఆంధ్ర ప్రాంతానికి వల్లభనేని జగదీశ్వర్ ఏటూరునాగారం ఈఈగా పదేళ్ల నుంచి పని చేస్తూనే ఇటీవల నర్సంపేట నీటిపారుదల శాఖ నర్సంపేట సర్కిల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ)గానూ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఏటూరునాగారం డివిజన్ కార్యాలయానికి దూరంగా ఉంటున్న ఆయన నర్సంపేట ఎస్ఈ విధుల నిర్వహణలో కూడా అలాగే వ్యవహరిస్తున్నట్లు డిపార్ట్ మెంట్ లో టాక్ ఉంది.

విద్యార్థినులకు బెల్టు, టై, షూస్, ఐడీ కార్డులు, డైరీలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం

- విద్యార్థులను సర్కారు స్కూళ్లలో చేర్పించాలి
- తల్లిదండ్రులను కోరిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షర దర్బార్, భూపాలపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయులు గొర్లవీడు పాఠశాలలో ఉన్నారని, ఈ నేపథ్యంలో విద్యార్థులను గొర్లవీడు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పరిసర గ్రామాల తల్లిదండ్రులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. గొర్లవీడు ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం డి.అనిత అధ్యక్షతన ఉపాధ్యాయ బృందం సమిష్టిగా ఆర్థిక చేయూత అందించి, విద్యార్థులకు బుధవారం ఉచితంగా బెల్టు, టై, షూస్, ఐడి కార్డులు, డైరీలు అందజేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించిందని, ఇటీవలే పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం కోసం నెలవారీగా నిధులు కేటాయించిందని చెప్పారు. తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గొర్లవీడు ఉపాధ్యాయ బృందాన్ని మిగతా పాఠశాలల ఉపాధ్యాయ బృందం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గత సంవత్సరం గొర్లవీడు పాఠశాలలో చదివి ట్రిబుల్ ఐటీ బాసర విద్యాసంస్థకు ఎంపికైన మారేపల్లి అక్షితను శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారి మండల రవీందర్ రెడ్డి, డిపిఓ నారాయణరావు, డీఎల్ పీఓ వీరభద్రం, ఎంపిపి నాగరాజు, ఉపాధ్యాయులు ఆర్. సుభాకర్ రెడ్డి, కె. దేవదాసు, ఏ. జయప్రకాష్, కె.శంకర్రావు, పి.శంకర్రావు, బి.వెంకటేశ్వర్లు, కె వంశీ రెడ్డి, ఎస్.కుమారస్వామి, యం. నవనీత్ కుమార్, కె.రమాదేవి, జె.మాలతి, మేనక, రియాజ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జనగామ డీఆర్డీవోగా వసంత

అక్షర దర్బార్, జనగామ: జనగామ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) గా ఎన్ వసంత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వానా భాష షేక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. గతంలో ఇక్కడ డీఆర్డీఓగా పనిచేసిన మొగులప్ప నారాయణపేటకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియామకమైన ఎన్ వసంత గతంలో ఇక్కడ పనిచేసి వికారాబాద్ వెళ్లి బదిలీపై జనగామకు వచ్చారు.

పాకాల పరవళ్లు

- మత్తడి దుంకుతున్న సరస్సు
- అలుగుపారుతున్న మదన్నపేట చెరువు
- ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకం

నర్సంపేట, అక్షరదర్బార్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో ఒక్కటైన పాకాల సరస్సు మత్తడి దుంకుతోంది. సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నిండింది. ఎగువన కొత్తగూడ, గంగారం మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పాకాల సరస్సులోకి నీరు చేరుతోంది. దీంతో సరస్సు అలుగుపారుతోంది. పాకాల సరస్సు విస్తీర్ణం 1,816 హెక్టార్లలో ఉంటుంది. మత్తడి పరవళ్లు తొక్కుతుండడంతో.. సందర్శకులు భారీగా తరలిరానున్నారు. పాకాల సరస్సుతో పాటు మదన్నపేట చెరువు సైతం మత్తడి పోస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

శాంపిల్ సీడ్ సేల్!

- విత్తన దుకాణాల నుంచి కాటన్ సీడ్ శాంపిల్ సేకరణ
- వాటిలో కొన్ని టెస్టింగుకు, మరికొన్ని మార్కెట్ కు
- పని దినాల్లోనూ విధులకు సరిగా హాజరు కాని అధికారి
- నిఘా విభాగాల దృష్టికి పలు అంశాలు

'అక్షర దర్బార్' ఎఫెక్ట్

అక్షర దర్బార్, పరకాల: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న పరకాలలోని ఓ వ్యవసాయ అధికారి శాంపిల్ కోసం విత్తన దుకాణాల నుంచి సేకరించిన కాటన్ సీడ్ ప్యాకెట్లలో కొన్నింటిని మార్కెట్ లో అమ్మి సొమ్ము చేసుకున్నట్లు నిఘా విభాగాల అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. అంతేకాదు పని దినాల్లో ఆయన విధులకు సరిగా హాజరు కాలేదని కూడా వారి నోటీసుకు వచ్చినట్లు తెలిసింది. తాను బదిలీ కానున్న దృష్ట్యా హనుమకొండ జిల్లా పరకాలలో పనిచేస్తున్న ఓ వ్యవసాయ అధికారి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ షాపుల ఓనర్ల నుంచి వసూళ్లకు దిగటంపై సోమవారం 'ఇదేమి శ్రీనివాసా ..?!' శీర్షికన 'అక్షర దర్బార్' పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనం వ్యవసాయ శాఖలో కలకలం సృష్టించగా సదరు అధికారి తీరుపై ప్రభుత్వ నిఘా విభాగాల అధికారులు ఆరా తీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయన దందాల్లో ఒక్కొక్కటి బయటపడుతున్నట్లు తెలిసింది. తాజాగా సదర్ అధికారికి సంబంధించిన మరికొన్ని విషయాలు నిఘా విభాగాల అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ప్రతి సంవత్సరం వానకాలం సీజన్ లో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు విత్తన దుకాణాల నుంచి శాంపిల్స్ (నమూనాలు) సేకరించి టెస్టింగ్ కోసం పంపిస్తారు. ఒక్కో శాంపిల్ కోసం రెండు కాటన్ ప్యాకెట్లను షాపు నుంచి సేకరిస్తారు. ఈ క్రమంలో పరకాలలో పనిచేస్తున్న వ్యవసాయ శాఖలోని ఓ అధికారి ప్రభుత్వం సూచించిన శాంపిల్స్ సంఖ్య కంటే వంద శాతం శాంపిల్స్ కోసం అదనంగా కాటన్ సీడ్ ప్యాకెట్లు సేకరించినట్లు తెలిసింది. వాటిలో కొన్నింటిని మాత్రమే టెస్టింగ్ కోసం పంపి మరికొన్నింటిని మార్కెట్లో అమ్మి క్యాష్ చేసుకున్నట్లు నిఘా విభాగాల అధికారుల దృష్టికి వచ్చిందని సమాచారం. ఈ విషయాన్ని తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే సదరు అధికారి పని దినాల్లోనూ సరిగా విధులకు హాజరు కాలేదని నిఘా విభాగాల అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈయన తీరువల్ల శాఖలోని ఓ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ఉద్యోగానికి రిజైన్ చేసి వెళ్లినట్లు కూడా తెలిసింది. 2021లో హనుమకొండలోని సుబేదారిలో ఈ అధికారిపై పేకాట కేసూ నమోదు అయినట్లు వారి నోటీసుకు వచ్చిందని తెలుస్తోంది. ఆయనకు సంబంధించి మరికొన్ని విషయాలు కూడా తమ దృష్టికి రావడంతో నిఘా విభాగాల అధికారులు నివేదిక రూపొందించే పనిలో ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఈ అధికారి వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

నీట మునిగిన భద్రాచలం

- జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షం
- కుంగిన కల్యాణ మండపం
- వరద నీటిలో అన్నదాన సత్రం
- అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన మంత్రి తుమ్మల
- తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆదేశాలు

భద్రాచలం, అక్షరదర్బార్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. మంగళవారంరాత్రి నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భద్రాచలంలోని రామాలయం పడమర మెట్ల వద్దకు వర్షపు నీరు చేరింది. సుమారు 35 దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో సామగ్రి మొత్తం వర్షపు నీటిలో తడిసిపోయింది. హరినాధబాబా ఆలయం వద్ద కొండపై కల్యాణమండపం కుంగిపోయింది. మండపం కింద కొండను తవ్వడం వల్ల కుంగిపోయినట్లు స్థానికులు తెలిపారు. భారీ వర్షాల వల్ల కల్యాణమండపం కిందకు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 1938లో హరినాధబాబా ఆలయం నిర్మించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై మంత్రి తుమ్మల ఆరా తీశారు. ఆ ప్రాంతానికి వెళ్లి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్కు ఆదేశించారు. దీంతో హరినాధ ఆలయం కల్యాణ మండపాన్ని కలెక్టర్ ఇతర అధికారులు పరిశీలించారు. కొండ కింద ఉన్న ఇళ్లు, దుకాణాల్లోని ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. మరోవైపు రామాలయం వద్ద అన్నదాన సత్రంలోకి వర్షపునీరు చేరింది. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. పడమరమెట్ల వద్ద వర్షపు నీట వల్ల నిలిచి ప్రయాణాలకు అంతరాయం కలిగింది. రామాలయం అన్నదాన సత్రం, విస్టా కాంప్లెక్స్లో వరద నీరు చేరడంపై మంత్రి తుమ్మల నీటిపారుదలశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదనీరు చేరిన వెంటనే మోటర్లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. వరద నీరు కరకట్ట స్లూయిజ్ లాకులు ఎత్తి ఖాళీ చేయాలని మంత్రి సూచించారు. ఆలయ పరిసరాల్లోకి వరదనీరు చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

తొర్రూరులో అనుమతుల్లేని అక్రమ వెంచర్లు

- దండుకుంటున్న రియల్టర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

అక్షర దర్బార్,తొర్రూరు: పట్టణ కేంద్రంలో రోజురోజుకు అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో గత కొద్ది రోజుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లు చేసి సామాన్యులకు ప్లాట్లను అమ్మకాలు చేసి కోట్లాది రూపాయల సొమ్మును కూడబెట్టుకుంటున్నా మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. తొర్రూరు నుండి అన్నారం వైపు వెళ్లే దారిలోని నితిన్ ఫౌండేషన్ భవనం వెనుక భాగంలో (విద్యానగర్) కాలనీలో సుమారు మూడు, నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అక్రమ వెంచర్లు నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం హాస్యాస్పదంగా మారింది. రియల్టర్లు మాత్రం ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రభుత్వం ఖజానాకు గండి కొడుతూ అధికారుల అండదండలతో అమాయక ప్రజలను మోసం చేయడం ఆనవాయితీగా మారిపోయింది. వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు లక్షలాది రూపాయల ఖరీదు పెట్టి అమాయకులకు మాయమాటలు చెప్పి ప్లాట్లను కొనుగోలు చేపించి బై నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించడంతో ఆ ప్లాట్లలో ఇల్లు నిర్మించుకోవడానికి మున్సిపల్ కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు లభించడం లేదని విశ్వసనీయ సమాచారం. ఈ అక్రమ వెంచర్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు, కొనుగోలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు మాత్రం మౌనం వహించడం గమనర్హం. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ వెంచర్లపై విచారణ చేపట్టి ఈ వెంచర్లకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తొర్రూరు శివారులో అక్రమంగా వెలిసిన వెంచర్

రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్..

- 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 స్థానాలకు ఉప ఎన్నికలు
- తెలంగాణలోని ఒక్క స్థానం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ ఖాతాలోకి!

ఢిల్లీ, అక్షరదర్బార్ : రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. అస్సాం, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది సభ్యులు లోక్సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. అలాగే, తెలంగాణ, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తమ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది కేంద్ర ఎన్నికల సంఘం. తెలంగాణలో కే. కేశవ రావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో తెలంగాణలో ఒక స్థానం ఖాళీ అయ్యింది.

ఆగస్టు 14న నోటిఫికేషన్ ..

12 రాజ్యసభ స్థానాల ఎన్నికకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 14న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. 21వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అలాగే.. బీహార్, హర్యానా, రాజస్థాన్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు 27వ తేదీని చివరి తేదీగా ప్రకటించారు. సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజ్యసభ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఇక తెలంగాణలో ఇంతకాలం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు.. ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సమయంలో తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు కేకే. దీంతో ఈ స్థానానికి సెప్టెంబర్ 3వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఆగస్టు 27వ తేదీని చివరి తేదీగా ప్రకటించారు. అయితే, మొత్తం 12 సీట్లలో 11 సీట్లు ఎన్డీయే కూటమి గెలుచుకునే అవకాశం కనిపిస్తోంది. ఒక్క సీటు మాత్రం కాంగ్రెస్ గెలిచే ఛాన్స్ ఉంది. అది కూడా తెలంగాణ నుంచే కాంగ్రెస్ రాజ్యసభ సీట్ కైవసం చేసుకోనుంది.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

ఏ.. బిడ్డా..! ఇది నా.. అడ్డా..!

- నన్నెవరేం చేయలేరని భింకం ప్రదర్శన
- కాటారం మండలంలో తాను ఆడిందే ఆట పాడిందే పాట
- తన ఆదాయం నుండి ఉన్నతాధికారులకు షేర్స్

పదేళ్లుగా పాతుకుపోయిన ఓ పంచాయతీ కార్యదర్శి



అక్షర దర్బార్,కాటారంః గ్రామం అభివృద్ధి పథంలో నడవాలంటే ఆ గ్రామానికి మొదటి వ్యక్తి సర్పంచ్ రెండో వ్యక్తి స్థానంలో పంచాయతి కార్యదర్శి ముందుండి నడిపిస్తూ ఉంటారు.సర్పంచ్ పదవీకాలం అయిపోతే అన్నీ తానై విధులు నిర్వర్తిస్తున్న గ్రామాన్ని సొంత గ్రామంగా చూసుకుంటూ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పంచాయతి కార్యద ర్శిదే.రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్న పంచాయతీ కార్యదర్శి నుండే మొదలవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.అలాంటి బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉంటూ గ్రామాన్ని సరిచేయాల్సిన పంచాయతి కార్యదర్శి గత పదేళ్లుగా కాటారం మండలంలోని ఒకే గ్రామంలో విధులు నిర్వర్తిస్తూ ఈ అడ్డా నాదే...అధికారులు నావాళ్లే అంటూ భింకం ప్రదర్శిస్తున్నాడు.సరిచేయాల్సిన అధికా రులు ఈయన గారికే వంతు పాడుతుండడంతో ఇక్కడంతా ఓపెన్ సీక్రటేనని తోటి ఉద్యోగులే బాహాటంగా చెప్తున్నారు.ఇటీవల కాలంలో అటెండర్ స్థాయి నుండి ఎంపీడీవో స్థాయి వరకు అందరికీ బదిలీ లున్నా ఈ పంచాయతీ కార్యదర్శికి మాత్రం బదిలీ లేక పోవడం పట్ల ఆ శాఖలో తన మార్క్ ఏంటో ఇట్టే తెలిసి పోతుందనంటూ అందరూ చర్చించుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు షేర్స్

కాటారం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఓ గ్రామంలో ఆదాయానికి కొదవే లేదు.ఎంతలా అంటే ఇంటికోరేటు,షాపు లైసెన్స్కో రేటు ఏదైనా షాపు అటు,ఇటు జరపాలన్న మరో రేటు నిర్ణ యించబడి ఉంటుంది.కర్మకాలి ఆ గ్రామంలో నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటేనా ప్రతీ పిల్లర్కో రేటు లెక్కించి సుమారు పిల్లర్కు రూ.50వేల చొప్పున కట్టించి ఇవ్వాల్సిందేనట.ఇలా మూడు పువ్వులు..ఆరు కాయలుగా కొనసాగుతున్న ఉద్యోగ పనిలో తన ఆదాయం నుండి సదరు పంచాయతీ కార్యదర్శి తన ఉన్నతాధికారులకు షేర్స్ ఇస్తూ తన పదవికి అడ్డెవ్వరనీ ఓపెన్ ఛాలెంజ్ విసురుతున్నాడు.కాటారం మండలంలో ఏదైనా గ్రామాన్ని తన ఉన్నతాధికారి విజిట్ చేయడానికి వస్తున్నాడంటే చాలు కారులో డీజిల్,మధ్యాహ్నం లంచ్,సాయంత్రం వెళ్లేటప్పుడూ ఖర్చులకు ఇచ్చి మర్యాదలు చేసి పంపుతాడని టాక్.ఇంకేముంది సదరు పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామపంచాయతీలో ఆడిందే ఆటగా సాగుతుంది.

సామాన్య ప్రజలపై ప్రతాపం

నేను మోనార్క్ను ఇక్కడ నన్నెవరూ ఏం చేయలేరనే డైలాగ్ను సదరు పంచాయతీ కార్యదర్శి మేజర్ గ్రామపంచాతీలో ఉంటున్న సామాన్య ప్రజా నికంతో వాడుతుంటారట.నాలీ నిండిందని,వీధుల్లో లైట్స్ లేవని,పరిశుభ్రత కరువైందని గ్రామస్తులు ఆయన గారి దగ్గరికి వెళ్లారా ఆగ్రహంతో ఊగిపో తారట.మాకు టైం ఉన్నప్పుడే వస్తామని ఎవరికి చెప్పు కుంటారో చెప్పుకోండని వార్నింగ్ ఇస్తారట.దీంతో చేసే దేంలేక ఆ గ్రామస్తులు అరిశుభ్రతల నడుమ చిమ్మ చీకట్లోనే ఉంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.కేవలం లీడర్లు,గొప్ప గొప్ప డబ్బున్న వ్యక్తులు ఫోన్చేస్తే క్షణాల్లో వాలి పనులు చేపిస్తాడని మాలాంటి సామాన్య ప్రజలపై ప్రతాపం చూపిస్తారని గ్రామస్తులు వాపోతున్నారు.అం దరికీ బదిలీలున్నా మా పంచాయతీ కార్యదర్శికి మాత్రం బదిలీ లేకపోవడంలో ఆంతర్యమేంటని కొత్తగా వచ్చిన కలెక్టర్ రాహుల్శర్మ గారైనా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీలో బీఆర్ఎస్

విలీనం లేదు..

- తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై చర్యలు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, అక్షరదర్బార్: బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపైన, విలీనంలాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపర మైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. 24 సంవ త్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారు లను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాం అని కేటీఆర్ తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటి లానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడు తుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతాం... కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్ప టికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలంటూ అధికారులకు ఆదేశం

హన్మకొండ, అక్షరదర్బార్: హన్మకొండ మండలం పలువేల్పులలోని అంగన్వాడీ కేంద్రం ఉన్నతీకరణలో భాగంగా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని హను మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం 1 డివిజన్లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు అంగన్వాడీల ఉన్నతీకరణలో భాగంగా ఇక్కడ జరుగుతున్న మైనర్ రిపేర్లు, టాయిలెట్లు నిర్మాణ పనులను పరిశీలించారు. మైనర్ రిపేర్లు ఏమైనా ఉంటే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ముఖాముఖిగా ముచ్చటించారు. కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై, ఇన్చార్జి డీడబ్ల్యూవో భాగ్యలక్ష్మి, సీడీపీవో విశ్వజ, ఏఈ రవీందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, అక్షరదర్బార్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్ారమని, తల్లికు కూడా మేలు కలుగు తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. బుధవారం తల్లిపాల వారోత్స వాల ముగింపు సందర్భంగా వరంగల్లోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో జిల్లా సంక్షేమశాఖ, జాతీయ ఆయుష్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశా నికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిశువు పుట్టిన గంటలోనే తల్లికి ముర్రుపాలు పట్టిస్తే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాల వారోత్స వాలు ముగింపు సందర్భంగా వరంగల్ పోస్ట్ ఆఫీస్ నుంచి సీకేఎం దవాఖానకు వరకు అంగన్వాడీ టీచర్స్, ఆశ సిబ్బంది ర్యాలీ నిర్వ హించారు.

వినేష్ ఫొగట్ పై అనర్హత వేటు

- ఒలింపిక్స్ ఫైనల్ లో ఇండియాకు భారీ షాక్
- 50 కేజీల కన్నా బరువు ఎక్కువగా ఉండటంతో రెజ్లర్ డిస్ క్వాలిఫై
- భారతీయులను తీవ్ర నిరాశకు గురి చేసిన ఐఓఏ నిర్ణయం
- మరింత బలంతో ముందుకెళ్లాలంటూ ప్రధాని మోదీ ట్వీట్

అక్షరదర్బార్, ఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్లో ఇండియాకు ఊహించని షాక్ తగిలింది. మహిళల రెజ్లింగ్లో గోల్డ్ మెడల్ పక్కా అని దేశ ప్రజలంతా నమ్మకంగా ఉన్న వేళ షాకింగ్ నిర్ణయం వెలువడింది. భాతర మహిళ స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ను ఒలింపిక్స్ ఫైనల్ నుంచి డిస్క్వాలిఫై చేశారు. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్లో ఫైనల్కు చేరుకున్న వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు వేశారు. దీంతో ఆమె ఎలాంటి పతకం లేకుండానే వెను దిరగాల్సిన పరిస్థితి వచ్చింది. 50 కేజీల బరువు కన్నా కొన్ని గ్రాముల వెయిట్ ఎక్కువగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు వేసినట్లు ఇండియన్ ఒలింపిక్ అసోసిషన్ (ఐఓఏ) వెల్లడించింది. ఈ మేరకు ఐఓఏ ఒక ప్రకటన విడుదల చేసింది. ‘‘మహిళల రెజ్లింగ్ 50 కేజీల విభాగం నుంచి వినేశ్ ఫొగాట్పై అనర్హత వేటు వేశారని వెల్లడించడానికి మేం చింతిస్తున్నాం. టీమ్ రాంత్రంతా ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. ఉదయం ఆమె 50 కేజీల కన్నా కొన్ని గ్రాముల బరువు అధికంగా తూగింది. దీంతో అనర్హత విధించారు’’అని చెప్పుకొచ్చింది. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ సెమీ ఫైనల్లో వినేశ్ 5-0తో క్యూబాకు

చెందిన ఉస్నేలిస్ గుజ్మన్ లోపెజ్పై విజయం సాధించింది. ఈ విజయంతో వినేష్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారత్ నుంచి రెజ్లింగ్లో ఫైనల్స్కు చేరిన తొలి మహిళా క్రీడాకారిణిగా నిలిచింది. ఈ గెలుపుతో తనకు కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. ఫైనల్ లో విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ పతకం పక్కా అనుకుంటున్న వేళ.. అనర్హత వేటు నిర్ణయం వెలువడటంతో క్రీడాభిమానులనే కాక భారతీయులందరినీ తీవ్ర నిరాశకు గురి చేసింది.

వినేష్ నువ్వే చాంపియన్ : మోడీ

పారిస్ ఒలింపిక్స్లో అనర్హత వేటు పడిన వినేశ్ ఫోగట్కు ప్రధాని మోదీ అండగా నిలిచారు. 'వినేశ్ నువ్వు భారత్కు గర్వకారణం. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్. దేశ ప్రజ లందరిలో స్ఫూర్తి నింపావు. ఇలా జరగడంపై నాకు కలిగిన నిరాశ మాటల్లో చెప్పలేకపోతున్నాను. నీ పట్టుదల నాకు తెలుసు. సవాళ్లను ఎదుర్కోవడమే నీ సహజతత్వం. మరింత బలంతో ముందుకెళ్లాలి. మీ గెలుపు కోసం చూస్తు న్నామంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రముఖ పారిశ్రా మిక వేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్ ద్వారా తన స్పందన తెలియజేశారు. నోనోనో.. ఇది పీడకల అయితే బాగుండు. ఇది నిజం కాకపోతే బాగుండు అంటూ ట్వీట్ చేశారు. ఆనంద్ మహీంద్రా మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు వినేశ్కు మద్దతుగా నిలిచారు. ఆమె ధైర్యం కోల్పోకూడదని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో ఆమెకు మద్దతుగా నిలవాలని అన్ని రాజకీయ పక్షాల నేతలూ వ్యాఖ్యలు చేశారు. కేవలం 100 గ్రాములు ఎక్కువ ఉందని ఆమెపై అనర్హత వేటు వేయడం దారుణ మని ఆప్ ఎంపీ అన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

- 2 కిలోల గంజాయి పట్టివేత!
- కూపీ లాగుతున్న పోలీసులు

అక్షర దర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంగళవారం రాత్రి గంజాయి బ్యాచ్ పట్టుబడ్డట్లు సమాచారం. రాత్రి పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా సుమారు 10 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.వారిని రాత్రి పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేపడుతుండగా పెద్ద మొత్తంలో గంజాయి స్మగ్లింగ్ సమాచారం ఇవ్వడంతో ఆ దిశగా పోలీసులు మిగతా బ్యాచ్ కోసం అన్వేషిస్తున్నారు.వారు ఇచ్చిన సమాచారం చైన్ సిస్టంగా మారడంతో పోలీసులు ప్రత్యేక వాహనాల్లో గంజాయి రాకెట్ గుట్టువిప్పు కోసం వేర్వేరు పట్టణాల్లో తిరుగుతున్నట్లు తెలుస్తోంది.గురువారం జిల్లా ఎస్పీ కిరణ్ఖరే కాటారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించు నన్నట్లు సమాచారం.

గంజాయిపై కాటారం పోలీసుల ఉక్కుపాదం

గత కొన్ని రోజులుగా కాటారం పోలిస్స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లింగ్ చేస్తూ సేవించే వ్యక్తులపై ఎస్పై అభినవ్ ఆధ్వర్యంలో ఉక్కుపాదం మోపుతున్నారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిత్యం చేపడుతూ అనుమానం వచ్చిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేస్తున్నారు.ప్రధానంగా కాటారంలోని కొన్ని అడ్డాల్లో గంజాయి సేవించే వ్యక్తులు ఉండే అవకాశాలు ఉంటాయన్న సమాచారంతో అక్కడ తనిఖీలు చేస్తున్నారు.ఎవరిపై అనుమానం వచ్చిన ఎంతటి వారినైనా వదిలిపెట్టమని ఎస్సై అభినవ్ హెచ్చరిస్తున్నారు.గంజాయి బారిన పడొద్దని తమ బంగారు జీవితాలను నాశనం చేయొద్దని పోలీసులు ప్రచారం కల్పిస్తూ ఎప్పటికప్పుడూ గంజాయి స్మగ్లింగ్పై నిఘా పెంచుతున్నారు.

పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి

కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న పీఠాధిపతి

అక్షర దర్బార్, మహాదేవపూర్ :నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పీఠాధిపతికి దేవస్థాన రాజగోపురం వద్ద దేవస్థాన అర్చకులు వేద పండితులు భాజా భజంత్రీలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. పూజారులు పీఠాధిపతి తో కాళేశ్వరం ముక్తేశ్వర స్వామివారికి అభిషేకం, పార్వతీ అమ్మవారి ని, మహా సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. బాలానంద బ్రహ్మ సరస్వతి కి ఆలయ కార్యనిర్వాహక అధికారి మారుతి, అర్చకులు వేద పండితులు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజే శారు. అనంతరం శ్రీ మహా కాల శివ లీల విలాసం ప్రవచన ములు పీఠాధిపతి భక్తులకు వినిపించారు. భక్తులకు మంగళ శాసనాలు అందజేసి ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్ర మంలో ఆలయ సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, తోపాటు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పరకాల మున్సిపల్ కార్యాలయంలో అదే విధంగా నడికూడ గ్రామపంచాయతీ ఆవర ణలో మొక్కలు నాటారు. దానితోపాటు నడికూడ మండలంలోని ప్రభుత్వ స్థలానికి పరిశీలించి వాటిని రైతుల సౌకర్యార్థం గోడౌన్లు, కోల్డ్ స్టోరేజ్ లాంటి వాటిని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తా మని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికా రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అమరవీరుల ఆశయాలు వృథా కావు

ఎంసీపీఐ యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు

అక్షర దర్బార్, దుగ్గొండి : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఎంతోమంది ప్రాణ త్యాగాలు వృథా కావని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ కుసుంబ బాబురావు అన్నారు. బుధవారం దుగ్గొండి మండలం రేబల్లె గ్రామంలో అమర జీవి కామ్రేడ్ గటికె వీరస్వామి 33 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కుసుంబ బాబురావు ముఖ్య అతిథిగా హాజరై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావే శంలో బాబురావు మాట్లాడుతూ... అమరజీవి కామ్రేడ్ ఓంకార్ నాయకత్వంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో చురుకుగా పాల్గొన్న గటికె వీరస్వామి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని, వారి ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామని వారి సేవలను కొనియా డారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పెర బోయిన చేరాలు, గీసపాక కొమురయ్య, పెర బోయిన ఐలోని, గటికె మొగిలి, మెరుగు సుధాకర్, లాసాని బాబురావు, సిరి బొమ్మల భాస్కర్, గటికె కోటేశ్వర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

తల్లిపాలు ముద్దు-డబ్బా పాలు వద్దు

మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే.దుర్గ

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మండలం తౌర్యాతండ పంచాయతీ పరిధి ముత్యాలమ్మ తండాలోని అంగన్వాడీ సెంటర్ లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ కే.దుర్గ పాల్గొని మాట్లాడారు. అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు పట్టించడం వల్ల పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని తెలిపారు. అదే విధంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరు నెలల వరకు డబ్బా పాలు పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు వినోద, జ్యోతి, దేవేంద్ర, సునీత పాల్గొన్నారు.

భాగిర్థిపేట పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

అక్షర దర్బార్, రేగొండ: మండలంలోని భాగిర్థిపేట పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ నం-పచ్చదనం కార్యక్రమం పనుల్లో భాగంగా భాగిర్థి పేట గ్రామం లో ఎటువంటి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోగా, ఉన్నతాధికా రుల ముందస్తు అనుమతి కోరకుండా విధులకు గైర్హాజరు కావడం, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసినందుకు పంచాయతీ కార్యదర్శి అజయ్ ని సస్పెండ్ చేస్తున్నట్లు భూపాల పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో నర్సంపేటలో సీఎం రేవంత్ పర్యటన

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి త్వరలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు కానున్నట్లు తెలిసింది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి తిరిగి ఇండియాకు వచ్చిన వెంటనే నర్సంపేట పర్యటన తేదీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నర్సంపేటకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎన్ఎంసీ అనుమతులు రావడంతో నూతన కళాశాలను ప్రారంభించేందుకు సీఎం వస్తున్నట్లు ఇందుకు ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ప్రజాప్రతినిదులతో పాటు అధి కారులు సీఎం పర్యటనపై చర్చించారు. ఈనెల మూడో వారంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

నకిలీ వైద్యులపై కేసు నమోదు..

అక్షర దర్బార్, నర్సంపేట : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్న ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు నమోదైంది. తెలంగాణ వైద్య మండలి రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు సమాచారం ఇదిలా ఉండగా కొన్ని రోజుల కిందట ఉన్నత వైద్య అధికారులు నర్సంపేటలో తనిఖీలు చేపట్టారు. చికిత్స చేయడానికి అర్హత లేకున్నా డాక్టర్ అని బోర్డుపై పెట్టుకుంటూ, ఎలాంటి అనుమతి లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించడంతో ఈ ఘటన చోటు చేసుకుంది ఈ సంఘటనపై నర్సంపేట పట్టణ సీఐ వివరణ కోరగా... నర్సంపేట పట్టణానికి చెందిన కే. జయేందర్ రెడ్డి, ఎన్. శ్యామ్ రాజు అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ సభ్యుడు డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ఎలాంటి అర్హత లేకుండా డాక్టర్ అని బోర్డులపై పెట్టుకుంటూ వైద్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించడం కోసమెరుపు.

మాయావతి తీర్మార్చుకో

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్

అక్షర దర్బార్, మహాదేవపూర్ : వర్గీకరణను వ్యతిరేకించేవారు బహుజనుల వ్యతిరేకులేనని, మాయావతి తీరు మార్చుకో వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే మాయావతి వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు జక్కయ్య, నల్లబాగ ధర్మయ్య, గట్టయ్య, చగినారపు తారాచంద్, చింతకుంట్ల సదానందం, బెల్లంపల్లి ప్రవీణ్ లింగాల సాగర్, చింతకుంట్ల రాము, లింగాల సుశాంత్ తో పాటు పలువురు ఎంఆర్పీఎస్ నాయకులు పాల్గొన్నారు